క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపుల తండాకు చెందిన పాడ్యా అనూష 108 అంబులెన్స్‌లో ఆడశిశువుకు గురువారం జన్మనిచ్చింది. ఈఎంటీ నర్సింగరావు, పైలెట్ అజీజ్ ఆమెకు సేవలు అందించారు. వివరాలిలా.. అనూష ఉదయం పురిటినొప్పులతో బాధపడుతుండగా ఆమెను ములుగులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనంలోనే నొప్పులు ఎక్కువయ్యాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

'స్వేరోస్'కు రాజీనామా

నర్సంపేట : స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థకు ఫౌండర్ మెంబర్, సీనియర్ రిసోర్స్‌పర్సన్ చింతం సదానందం రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమసమాజ స్థాపనకు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ప్రారంభమైన స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థకు తాను ఫౌండర్ మెంబర్ అయినందుకు గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్ అధ్యాపక పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సదాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఫిజిక్స్ బోధించడానికి ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ అర్హత కలిగిన వ్యక్తులు నేడు (శుక్రవారం), రేపు బయోడేటా, సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో కళాశాలను సంప్రదించాలని తెలిపారు. సోమవారం డెమో తరగతులు నిర్వహిస్తామన్నారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరికి చెందిన మంద నారాయణ (56) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం కుమార్, మాజీ సర్పంచ్ మాదారపు భాస్కర్, భద్రునాయక్, యూత్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, నాయకులు సోమయ్య, ప్రభాకర్, వేణు, అశోక్ పాల్గొన్నారు.

వివేకానందుడి వర్ధంతి

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలో స్వామి వివేకాంద వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు గుజ్జ గోపాల్‌రావు, సిల్వేరు కుమారస్వామి, జన్ను రాములు, పొనుగోటి చందర్‌రావు, శ్యామలరావు, కొండేటి సంపత్, పట్టల రాజు, కంజర్ల రవీందర్, లక్ష్మణ్, తిరుపతి, సురేశ్, ఐత ఎల్లయ్య, గబ్బెట బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పర్వతగిరి : మండలంలోని దేవీలాల్‌తండాకు చెందిన గుగులోతు బీక్యానాయక్ (20) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం బీక్యానాయక్ ఆత్మహత్యకు యత్నించాడు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సూచనల మేరకు కాకతీయ ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు సహకారంతో బీక్యానాయక్ రెటీనా (కంటి పొరలను) అతడి తండ్రి యాకూబ్, కుటుంబ సభ్యులు గుగులోతు వీరన్న, గుగులోతు వెంకన్న సూచనల మేరకు దానం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె..

నెక్కొండ : మండలంలోని అలంకానిపేటలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. బాధిత పాడి రైతు నీలం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామంలోని బంధం చెరువు సమీపంలో గాలి వానకు విద్యుత్ తీగ పడి ఉండగా ఉదయం మేత కోసం వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తనకు సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని శ్రీనివాస్ వాపోయారు. రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు

పర్వతగిరి/రాయపర్తి : పర్వతగిరి, రాయపర్తి, వర్ధన్నపేట మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. పర్వతగిరిలోని పర్వతాల శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

నర్సంపేట : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పాలకుల తప్పుడు విధానాలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. వెట్టిచాకిరీ, దోపిడీ, పీడన లేని వ్యవస్థ కోసం కొమురయ్య ప్రాణత్యాగం చేశాడన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, నాయకులు కందికొండ రాజు, కత్తి కట్టయ్య, పెండ్యాల సారయ్య, రాజులపాటి సూరయ్య, పత్కాల బాబు, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, యాకలక్ష్మి, విలియం కేరీ, రాధ నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ కార్యాలయంలో..

కొమురయ్య చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ, బోగి సారంగపాణి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్ నాయకులు మల్లన్న, భద్రాజీ, సమ్మయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ సెంటర్‌లో..

సీపీఐ నాయకులు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అధ్యక్షత వహించి మాట్లాడగా సీపీఐ మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, జిల్లా నాయకులు ఇల్లందుల సాంబయ్య, గడ్డం నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాకూబ్ పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొమురయ్య చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు మహమూద్, చిర్ర మల్లయ్య, గుగులోతు శ్రీనివాస్, మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

'మార్కెట్' చైర్మన్‌గా పాలాయి



నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పాలాయి శ్రీనివాస్ నియమితుయ్యారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సన్నిహితుడైన శ్రీనివాస్‌కు మూడోసారి చైర్మన్ పదవి దక్కడం విశేషం. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2005 నుంచి 2010 వరకు రెండుసార్లు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆయన పని చేశారు. గతంలో కౌన్సిలర్‌గానూ సేవలు అందించారు.

మార్కెట్ అభివృద్ధిలో తనదైన ముద్ర..

నర్సంపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి శ్రీనివాస్ విశేష కృషి చేశారు. ఆయనకు చైర్మన్ పదవి దక్కడంతో వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2007లో నర్సంపేట మార్కెట్‌ను గ్రేడ్-1గా ఏర్పాటు చేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం

మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన శాఖమూరి హరిబాబు వైస్‌చైర్మన్‌గా, సభ్యులుగా బొల్లు రమేశ్, కొల్లూరి మధుకర్, చీర అశోక్, కోరె కుమారస్వామి, హింగె రామారావు, చెలుపూరి జ్యోతి, అజ్మీర దంజ్యానాయక్, డక్క శ్రీనివాస్, సలావుద్దీన్ అయూబ్‌ఖాన్, గట్టి సారంగపాణి, స్వామిశెట్టి ప్రభాకర్, బండారి దామోదర్ నియమితులయ్యారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు గురువారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. పట్టణంలోని స్కూళ్లు, కాలేజీలను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్, టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బంద్ చేయించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నర్సంపేట డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడారు. నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, టీఎస్ఎఫ్ నాయకుడు శివరాత్రి కుమార్, ఇతర సంఘాల నాయకులు రాజేశ్, ఉషాకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ మాట్లాడారు. నీట్‌లో జరిగిన అవకతవకలపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని, రెగ్యూలర్ ఎంఈఓలను నియమించాలని, తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వంశీ, రాజు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు

గీసుకొండ : మండలంలో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు గూడ సాయిరాం మాట్లాడారు. నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య నాయకులు రాజు, రాకేశ్, మధు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలో బంద్ జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రమేశ్, రాజు, మధు, శివ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడలో వృక్ష సంపద కీలకం



పర్వతగిరి : ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పర్వతగిరి : మానవ మనుగడలో వృక్ష సంపద కీలకమని స్థానిక ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని వడ్లకొండ, కల్లెడ, తదితర గ్రామాల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వన మహోత్సవంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాధవుడు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని బంధంపల్లి, చాపలబండ, మందపల్లి గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు రంగోలీ పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్ని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు సమ్మయ్య, భద్రు, రాజు, మౌనిక, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, స్రవంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు సుమలత, రాణి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : ఆశాజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలో ర్యాలీలు, రంగోళీ పోటీలు నిర్వహించారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దయాకర్ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో వెయ్యి చొప్పున సీడ్ బాల్స్ తయారు చేశామన్నారు. ప్రతీ కుటుంబానికి 6 చొప్పున పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు అందజేస్తామని చెప్పారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో రోడ్డు కిరువైపుల నాటిన మొక్కలను, చెట్లను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రంగోలీలో పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీఓ శ్రీధర్‌రాజు, ఏపీఎం ఈశ్వర్, ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్, సీసీలు కట్టయ్య, సుజాత, మంజుల, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కాపులకనిపర్తి రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చెట్ల ప్రాముఖ్యను ఏపీఎం కిషన్ వివరించారు. మహిళలకు ముగ్గుల, ఉపాన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఏపీఎం కిషన్ మాట్లాడారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. పొలం గట్లపై, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ గణేశ్, పంచాయతీ కార్యదర్శి సందీప్, వీఓ అధ్యక్షురాలు మమత పాల్గొన్నారు.

సన్మానం



సంగెం : ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో సంగెం, గీసుకొండ మండలాల జెడ్పీటీసీలు సుదర్శన్‌రెడ్డి, ధర్మారావుతోపాటు ఎంపీటీసీలను హనుమకొండలోని తన నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం సన్మానించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడారు. పదవులు లేకున్నా ప్రజాసేవలో ఉండాలని సూచించారు.

ఎంపీటీసీ సోమలక్ష్మికి..



రాయపర్తి (వర్ధన్నపేట): వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట ఎంపీటీసీ చొప్పరి సోమలక్ష్మి దంపతులను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భూక్య రమేశ్‌నాయక్, పశు వైద్యాధికారి భూక్య రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ



రాయపర్తి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ వేదవతి మండలంలోని పన్యానాయక్‌తండాలోని చిత్తలూరి సంధ్యారాణి కోళ్లఫాం నిర్మాణాల వద్ద విచారణ చేపట్టారు. కోళ్లఫాం నిర్మాణాలను నిలిపి వేయాలని కోరుతూ గత నెల 10న గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన క్రమంలో గ్రామాన్ని డీఎల్‌పీఓ సందర్శించి కోళ్లఫారాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చే వరకు నిర్మాణాలు కొనసాగించవద్దని నిర్వాహకులకు డీఎల్‌పీఓ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వెంకట్రామ్, మాజీ ఎంపీటీసీ భూక్య క్రాంతి, నాయకులు మాలోతు దేశీరాం, శంకర్, దేవ్లా, గోపాల్, కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమికే 'రైతు భరోసా' ఇవ్వాలి

సంగెం : పంటలు సాగు చేసే భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని కాపులకనిపర్తి సొసైటీ ఆవరణలో చైర్మన్ దొమ్మాటి సంపత్‌గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతులు సూచనలు, సలహాలు అందించారు. చెరువులు, కుంటలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు, ఇటుక బట్టీలు వంటి భూములకు సంబంధించి రైతు భరోసా ఇవ్వవద్దని పలువురు రైతులు తెలిపారు. రైతులు సాగు చేసిన 10 ఎకరాల వరకున్న భూమికి మాత్రమే రైతు భరోసా ఇస్తే అర్హులకు లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి, మండల వ్యవసాయాధికారి యాకయ్య, సొసైటీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, డెరెక్టర్లు చేరాలు, రవీందర్, వెంకటలక్ష్మి, పోశాలు, కిషన్ నాయక్, రాజు, భిక్షపతి, రాజేందర్, కుమారస్వామి, ఏఈఓ లావణ్య, సీఈఓ రమణచారి తదితరులుపాల్గొన్నారు.

గీసుకొండ : స్థానిక సొసైటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. ఎక్కువ భూమి ఉన్న సంపన్నులకు రైతు భరోసా కింద సహాయం అందించవద్దని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు రడం శ్రీధర్ మాట్లాడారు. సమావేశంలో వర్ధన్నపేట ఏడీఏ శ్రీనివాస్, ఏఓ శ్రీధర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : పంటలు సాగు చేసే వారికి మాత్రమే మాత్రమే రైతు భరోసా అందించాలని మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన రైతు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కూస సుదర్శన్ ఒక ప్రకటనలో అభిప్రాయం వెలిబుచ్చారు. ఆదర్శ రైతుగా తన అభిప్రాయాన్ని ఆయన వెల్లడించారు. కౌలు రైతులకు వ్యవసాయం చేస్తేనే భరోసా అందించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వెంచర్లకు, చెరువు శిఖం భూములకు, గుట్టలకు అక్రమ పట్టాలు చేసి రైతుబంధు అందించిందని ఆందోళన వెలిబుచ్చారు. పదెకరాలలోపు వ్యవసాయం చేస్తున్న రైతులకు తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా లబ్ధి చేకూర్చాలని కోరారు.

స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతల స్వీకరణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమెకు ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సునీల్‌కుమార్ రాజ్, సిబ్బంది పూలబొకె అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గీసుకొండ : మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.సురేశ్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండల ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారిగా వ్యవసాయ శాఖ ఏడీఏ సురేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన్ను ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో శాలువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయపర్తి : మండల ప్రజాపరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా మత్స్య శాఖ అధికారి నరేశ్ కుమార్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీఓ తుల రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌నాయక్, దేవేందర్, అంబేడ్కర్, టీఏ వెంకట్‌రెడ్డి, ఆపరేటర్ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా డీసీఓ బి.సంజీవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండల అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీఓ శ్రీనివాసులు, సిబ్బంది అయేషా పర్వీన్, దుర్గాప్రసాద్, బి.రఘునాథ్‌రెడ్డి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. బాలకృష్ణకు ఎంపీడీఓ దయాకర్, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, టైపిస్ట్ రజిత, జూనియర్ అసిస్టెంట్ సమ్మయ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా నరేశ్



నెక్కొండ : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా నరేశ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన మేనేజర్ అనిఫ్ బదిలీపై ఏపీలోని విశాఖపట్టణంకు వెళ్లగా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందు శాఖ మేనేజర్‌గా పని చేసిన నరేశ్ ఇక్కడకు బదిలీపై వచ్చారని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. బ్యాంక్ ఖాతాదారులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందేలా చూస్తామన్నారు. ఖాతాదారులు బ్యాంక్ నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. అనంతరం మేనేజర్ నరేశ్‌కు బ్యాంక్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- మాజీ సర్పంచ్‌ల ధర్నా

నల్లబెల్లి : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట తాజా మాజీ సర్పంచ్‌లు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం మాట్లాడారు. అధికారుల సూచన మేరకు అప్పు చేసి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. బిల్లులు చెల్లించాలని సీఎంకు, మంత్రులతోపాటు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీఓ కూచన ప్రకాశ్ ధర్నా వద్దకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. తదనంతరం ఎంపీఓ ప్రకాశ్‌కు ఆందోళనకారులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చింతపట్ల సురేష్, లావుడ్యా తిరుపతి, చీకటి ప్రకాశ్, మామిండ్ల మోహన్‌రెడ్డి, సిద్దూరి రత్నాకర్‌రావు, ఊరటి అమరేందర్ పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



రాయపర్తి (వర్ధన్నపేట): ఓ మహిళ ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బ్యాగును పోలీసులు గంట వ్యవధిలో దొరకబట్టి అప్పగించారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. జగ్గిరిగుట్ట నుంచి వరంగల్ మీదుగా తొర్రూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో రమ్య అనే ప్రయాణికురాలు జనగామలో ఎక్కి వరంగల్‌లో దిగింది. ఈ క్రమంలో ఆమె బ్యాగు కనిపించకపోవడంతో ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఆర్టీసీ అధికారులు సదరు బస్సు వర్ధన్నపేటకు చేరుకున్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రహదారిపై బస్సును నిలిపివేసి తనిఖీ చేశారు. రమ్య కూర్చున్న సీటు కింది భాగంలో బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రమ్యకు సమాచారం అందించి ఆమెకు బ్యాగు అప్పగించారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

గీసుకొండ: బీజేపీ చేపట్టిన 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమం కింద ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు శాయంపేటహవేలిలోని పాంచాల రాయస్వామి ఆలయంలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, ముల్క ప్రసాద్, మొలుగూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం

రాయపర్తి : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించనున్నట్టు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు తెలిపారు. మండలంలోని గన్నారంలో స్థానిక సమస్యలపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. వాటర్ ప్లాంట్, హ్యాండ్ పంప్ మరమ్మతు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, అంతర్గత రోడ్లు, ఊర చెరువు తూము మరమ్మతు, తదితరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు గుగులోతు శ్రీనివాస్, మల్లయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు తీర్మానం

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిష్ఠాపన, వృద్ధుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నెక్కొండ గ్రామీణ హితకారిణి సేవా సంఘం బ్రాంచి ఆర్గనైజింగ్ కమిటీ, వృద్ధ పౌరుల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కమిటీ సంయుక్తంగా తీర్మానం చేశాయి. గ్రామంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వృద్ధ పౌరుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటిక మల్లయ్య మాట్లాడారు. ఈనెలాఖరులోగా జ్యోతిరావుపూలే విగ్రహ ప్రతిష్ఠాపన, వృద్ధ పౌరుల కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం కన్వీనర్ పల్లెపాటి రాంచందర్‌రావు, హితకారిణి సేవా సంఘం కన్వీనర్ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

పర్వతగిరి : వార్డు మెంబర్ నుంచి అన్ని స్థాయి పదవుల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ పాలెపాక శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మండల ఉపాధ్యక్షుడు మహ్మద్ యాకూబ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి శంకర్ అతిథిగా పాల్గొని మాట్లాడారు. పింఛన్ పెంచుతామని మేనిఫెస్టోలో పొందుపర్చి కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి 7 నెలలు గడచినా పట్టించుకోవడం లేదన్నారు. దివ్యాంగులకు రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వడంతోపాటు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం నేడు (శుక్రవారం) తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఈగ శ్రీనివాస్, అనపర్తి శంకర్, ఉడుగుల వెంకన్న, సిరికొండ నాగరాజు, బొట్ల మంగమ్మ, సొందరయ్య, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకున్న ఆఖరి మజిలీ ఆవాస కేంద్రం



హారిక(ఫైల్)

నర్సంపేట: పట్టణంలో కిరాయి ఉంటున్న వారు అకాల మరణం చెందితే ఇంటి యజమానుల నుంచి అనేక ఇబ్బందులు వస్తాయి. మృతదేహాన్ని ఇంటి ముందు ఉంచడానికి నిరాకరిస్తున్న సమయంలో మాదన్నపేట రోడ్డులోని శ్మశానవాటిలో ఏర్పాటు చేసిన ఆఖరి మజిలీ ఆవాస కేంద్రం ఆదుకుంటోంది. పట్టణానికి చెందిన మైసా హారిక(31) క్యాన్సర్‌తో వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందింది. ఆమె కుటుంబం కిరాయి ఇంటిలో నివాసం ఉంటుండగా కుటుంబ సభ్యులు శ్మశానవాటికలోని ఆఖరి మజిలీ ఆవాస కేంద్రంలో దహన సంస్కారాలు నిర్వహించారు. మృతురాలికి భర్త స్వామి, ఇద్దరు పిల్లలున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, నర్సంపేట పట్టణ గంగపుత్ర, ముత్తోజిపేట గంగపుత్ర సంఘం నాయకులు హారిక మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. గంగపుత్ర బాల్యమిత్రులు ఆర్థిక సాయం అందించారు. సొంత ఇల్లు లేకపోకపోవడంతో ఆవాస కేంద్రం ఆదుకుంది.